

మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన తిప్పారం సర్పంచ్

## సొంతగూటికి తిప్పారం సర్పంచ్

కొండపాక(కుకనూరుపల్లి), నవంబర్ 19 : కుకునూరుపల్లి మండలం తిప్పారం సర్పంచ్ కర్రె లక్ష్మీరాజయ్య సొంతగూటికి చేరుకున్నారు. ఇటీవల బీజేపీలో చేరిన తిప్పరం సర్పంచ్ తమ గ్రామ సమస్యలు మంత్రి హరీశ్‌రావుకు వివరించడంతో పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. ఆదివారం మంత్రి హరీశ్‌రావు సమక్షంలో తిప్పరం సర్పంచ్ లక్ష్మీరాజయ్య తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్‌ను వీడిన 5 రోజులు మానసిక క్షోభకు గురయ్యానని, ఇప్పుడు బీఆర్ఎస్‌లో చేరడంతో పుట్టింటికి వచ్చినట్లు అనిపిస్తున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్, మాత్‌పల్లి సర్పంచ్ మహిపాల్, సీనియర్ నాయకుడు కోలా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## టూరిస్టు నాయకులను నమ్మితే మోసపోతాం



పాములపర్తిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మర్కూక్, నవంబర్ 19 : అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతిఒక్కరూ ఆలోచన చేయాలని, ఐదేండ్లకోసారి ఎన్నికల సమయంలో వచ్చే టూరిస్టు నాయకులను నమ్మితే మోసపోతామని ఎంపీపీ పాండుగౌడ్, బీసీ సెల్ నాయకుడు మేకల కనకయ్య అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పాములపర్తి గ్రామంలో కేసీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు మ్యానిఫెస్టోను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేండ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓటేయాలన్నారు. ఎన్నికలు రాగానే కండువాలు మార్చుకొని వచ్చే బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మితే గోస పడతామన్నారు. భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేసే నాయకుడు కేసీఆర్‌ను గెలిపిస్తే కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మహేశ్, నాయకులు రాజేశ్‌గౌడ్, కిష్టగౌడ్ పాల్గొన్నారు.

## నా పెద్దకొడుకే గెలుస్తాడు..



గజ్వేల్ లక్ష్మీప్రసన్న కాలనీలో వృద్ధురాలిని ఓటు అడుగుతున్న నాయకులు

గజ్వేల్ అర్బన్, నవంబర్ 19 : గజ్వేల్ పట్టణంలోని 16వ వార్డు లక్ష్మీప్రసన్న కాలనీలో ఆదివారం కౌన్సిలర్ భాగ్యలక్ష్మీదుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో భాగంగా సాయిబాబా ఆలయం వద్ద ఓ వృద్ధురాలు బొమ్మ సత్తెమ్మను ఓటు ఎవరికివేస్తావంటూ అడుగగా.. ఇంకెవరికి కేసీఆర్‌కే వేస్తా.. నా పెద్దకొడుకు కేసీఆరే మళ్లీ సీఎం అయితడంటూ ధీమాగా చెప్పింది. కేసీఆర్‌తో నాకు పింఛన్ వస్తుంది. రెండెకరాలకు రైతుబంధు రూ.20 వేలు వస్తున్నయి.. అందుకే మళ్లీ కేసీఆర్‌కే ఓటేస్తానని తెలిపింది. దీంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సంతోషం వ్యక్తం చేశారు.

## జోరుగా ఇంటింటి ప్రచారం



కుకునూరుపల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొండపాక(కుకనూరుపల్లి), నవంబర్ 19 : కుకునూరుపల్లిలో మండల ఇన్‌చార్జి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దేవీ రవీందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో ఎన్ఆర్‌జీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు సద్గుణారవీందర్, మాతపల్లి సర్పంచ్ బచ్చలి మహిపాల్, రాచకొండ కనకయ్య, సీహెచ్ కనకయ్య, ఆశని రాజు, గౌటి అనిల్‌కుమార్, బూరమైన నర్సింహులు, దబ్బెట కృష్ణ, యాదగిరి, ఐలయ్య, ఎల్లం రవి, ఉమార్‌ఖాన్, అజారుద్దీన్, కరుణాకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌కు సరిలేరు..

### ఎన్నికల ఇన్‌చార్జి రవీందర్‌రావు



నర్సంపల్లిలో మాట్లాడుతున్న మండల ఎన్నికల ఇన్‌చార్జి రవీందర్‌రావు

ములుగు, నవంబర్ 19 : సమైక్య పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న తెలంగాణను ప్రగతి పథంలో పరుగులు పెట్టిస్తున్న సీఎం కేసీఆర్‌కెవ్వరూ సరిలేరని మండల ఎన్నికల ఇన్‌చార్జి డాక్టర్ పేర్యాల రవీందర్‌రావు, ఏఎంసీ చైర్మన్ జహంగీర్, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. ఆదివారం ములుగు మండలం నర్సంపల్లి, కొట్యాల్ గ్రామాల్లో సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గణేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మహిళా ఉపాధ్యక్షురాలు అక్షితారెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించి కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించే సత్తా కేసీఆర్‌కు తప్పా మరెవ్వరికీ లేదన్న విషయాన్ని ప్రజలు గుర్తుపెట్టుకోవాలన్నారు. కాంగ్రెస్ పాలనలో విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని, బీఆర్ఎస్ హయాంలో నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. మిషన్ భగీరథతో ప్రతి ఇంటికీ నల్లా ద్వారా తాగునీటిని ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. గతంలో మన పరిస్థితులు ఎలా ఉండేటివి, ఇప్పుడేలా ఉన్నాయన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం పలువురు కాంగ్రెస్, బీజేపీ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరినవారికి గులాబీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ వింగ్ ఉపాధ్యక్షుడు జుబేర్‌పాషా, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి నర్సంపల్లి అర్జున్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి బాబు గౌడ్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నరేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ బీసీ సెల్ నాయకుడు శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు సమితి కో-ఆర్డినేటర్ నర్సింహారెడ్డి, ఎంపీటీసీ మధుసూదన్‌రెడ్డి, రైతుబంధు సమితి గ్రామాధ్యక్షుడు శేఖర్, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మళ్లీ కేసీఆరే సీఎం



ప్రచారంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి



12వ వార్డులో ఇంటింటి ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

గజ్వేల్ అర్బన్, నవంబర్ 19 : సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు ఎంతో మేలు చేశారని, మళ్లీ పక్కాగా కేసీఆరే సీఎం అవుతారని మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జి పాతూరి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి అన్నారు. ఆదివారం గజ్వేల్ పట్టణంలోని 12వ వార్డులో కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, 16వ వార్డులో కౌన్సిలర్ భాగ్యలక్ష్మీదుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పాతూరి సుధాకర్‌రెడ్డి, ఎన్సీ రాజమౌళి పాల్గొని మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని తెలిపారు. రైతుబంధు, ఉచిత విద్యుత్, సాగునీటితో రైతులు బంగారు పంటలు పండిస్తూ ఆర్థికంగా బలపడ్డారన్నారు. ఇంటింటికీ తాగునీరు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లతో జీవితానికి భరోసా కలిగిందని ప్రజలు సంతోష పడుతున్నారన్నారు. కేసీఆర్‌ను భారీ మెజార్టీతో ప్రజలు గెలిపిస్తారని, మళ్లీ కేసీఆరే సీఎం అవుతారని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో వార్డుల అధ్యక్షుడు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

**ప్రచారంలో పాల్గొంటున్న మహిళలు..**

గజ్వేల్ పట్టణంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ప్రచారంలో మహిళలు స్వచ్ఛందంగా పాల్గొంటున్నారు. గజ్వేల్ 12వ వార్డులో కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారంలో మహిళలు పాల్గొని సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్నారు. నాయకుల కన్నా ఉత్సాహంగా మహిళలు పాల్గొని బీఆర్ఎస్ కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. కేసీఆర్ గెలిస్తేనే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని ప్రజలకు వివరించారు.

## తెలంగాణకు హ్యాట్రిక్ సీఎం కేసీఆరే

గజ్వేల్, నవంబర్ 19 : తెలంగాణకు హ్యాట్రిక్ సీఎం కేసీఆర్ కావడం పక్కా అని, ప్రతిపక్షాలు చెప్పే మాటలను ప్రజలు నమ్మేస్థితిలో లేరని, సీఎం కేసీఆర్ పాలనే తెలంగాణకు శ్రీరామరక్ష అని ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మధు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పిడిచేడ్‌లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో కేసీఆర్ సహకారంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసుకున్నామని, ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయల నిధులతో పనులు పూర్తి చేశామన్నారు. ఈసారి ఎన్నికల్లో కేసీఆర్‌కు పిడిచేడ్ నుంచి భారీ మెజార్టీ వచ్చేలా అందరూ కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని కార్యకర్తలు ప్రతిఒక్కరూ సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, సర్పంచ్ శిల్పాఅశోక్, ఎంపీటీసీ రాజేశ్వరీకృష్ణ, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రమేశ్, నాయకులు రాములు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పిడిచేడ్ ప్రచారంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, మధు

## రెండు కార్లు ఢీ, ఇద్దరు మృతి

గజ్వేల్, నవంబర్ 19 : రాజీవ్ రాహదారిపై రెండు కార్లు ఢీకొని ఇద్దరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని ప్రజ్ఞాపూర్ సమీపంలోని రాణే కంపెనీ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. సీఐ జాన్‌రెడ్డి వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి కారులో భార్యాభర్తలు చంద్రమోహన్, పరమేశ్వరి సిద్దిపేటకు బయలుదేరారు. ప్రజ్ఞాపూర్ సమీపంలోకి రాగానే డివైడర్‌ను ఢీకొని కారు అవతలి వైపునకు దూసుకెళ్లి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. చంద్రమోహన్(65) అక్కడికక్కడే మృతి చెందగా, అతడి భార్య పరమేశ్వరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో డ్రైవర్ శనిగరం వెంకట్‌తోపాటు అందులో ఉన్న వైద్యులు కొటగిరి స్వప్న, మంద ప్రసన్నకు గాయాలయ్యాయ. గాయపడ్డ వారిని వెంటనే గజ్వేల్ దవాఖానకు తరలించారు. వెంకట్(45) పరిస్థితి విషమంగా ఉండడంతో అతడిని అక్కడి నుంచి కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రస్తుతం వైద్యులు స్వప్న, ప్రసన్న చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.